
# సాక్షి గుంటూరు

శనివారం । 17 । మే । 2025



## వికసించిన మే పుష్పం

దుగ్గిరాల: దుగ్గిరాలలో శుక్రవారం పాస్టర్ మండేపూడి ఐజయ్య ఇంట్లో మే పుష్పం వికసించింది. ఏడాదికోసారి పూసే ఈ పుష్పం చూపరులను ఆకట్టుకుంటోంది.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.300 టీఎంసీలకు సమానం.



## 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవం

బాపట్ల: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ శుక్రవారం బాపట్లలో నిర్వహించారు. మాజీ సైనికులు, మున్సిపల్ అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### పంచాయతీ వనరుల కేంద్ర భవన నిర్మాణ పనులు పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని జెడ్పీ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర భవన పనులను శుక్రవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ పరిశీలించారు. శుక్రవారం నగరానికి వచ్చిన కృష్ణతేజ, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో పాటు పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి భవన నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించిన కృష్ణతేజ శిథిలావస్థకు చేరిన పరిపాలన భవనానికి మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికుమార్, డ్వామా, డీఆర్‌డీఏ, జెడ్పీ అధికారులు పాల్గొన్నారు.

### వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: స్థానిక శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిత్యహోమం, కలశ పూజ, ఆలయ బలిహరణ వంటి కార్యక్రమాలను దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 6.30 గంటలకు శేష వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### డీఎస్సీకి 25,067 మంది దరఖాస్తు



బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన డీఎస్సీ–2025 దరఖాస్తు ఘట్టం ముగిసింది. గురువారం అర్ధరాత్రి గడువు ముగిసే సమయానికి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులకు 25,067 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత ప్రాతిపదికన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఒక దరఖాస్తు దాఖలు చేసిన అభ్యర్థులతోపాటు రెండు పోస్టులకు కలిపి దాఖలు చేసిన దరఖాస్తులతో కలుపుకొని ఆన్‌లైన్‌లో మొత్తం 43,570 దరఖాస్తులు దాఖలయ్యాయి. పురుషులు 8,431 మంది, మహిళా అభ్యర్థులు 16,636 మంది ఉన్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) జూన్ 6వ తేదీ నుంచి జరగనుంది. ఈ నెల 20 నుంచి మాక్ టెస్ట్‌లు జరగనున్నాయి. 30 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడింగ్, జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు ఆయా కేటగిరీల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 పోస్టులు భర్తీ చేయనున్నారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 622, ఎస్జీటీలు 521 ఉన్నాయి. వీటితో పాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మరో 16 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సబ్జెక్టుల వారీగా తెలుగు 42, హిందీ 57, ఇంగ్లిషు 69, గణితం 35, ఫిజికల్ సైన్స్ 58, బయోలాజికల్ సైన్స్ 86, సోషల్ 109, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166తోపాటు సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 521 ఉన్నాయి.

### భూసేకరణపై వ్యతిరేకత

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రభుత్వం ఏర్పాటు చేసే సోలార్ ఇంధన ఉత్పాదక కేంద్రానికి తమ భూములు ఇవ్వబోమని గ్రామస్తులు ముక్తకంఠంతో పలికారు. సంతమాగులూరు మండలం మావిళ్లపల్లి గ్రామ రైతులు శుక్రవారం జరిగిన గ్రామసభలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుకు తెలియజేశారు. మండలంలోని కుందుర్రు, మావిళ్లపల్లి గ్రామాలలో 1,500 ఎకరాలు కావాలని అధికారులు వారిని కోరారు.



డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం



ఏటీ అగ్రహారం 9వ లైను వద్ద కూలిన చెట్టు



మెడికల్ కళాశాల ప్రాంతంలో నిలిచిన వాననీరు

# గాలివానకు గజగజ

ఉన్నట్లుండి ముంచుకొచ్చింది... ఒక్కసారిగా విరుచుకుపడింది... ఉరిమి ఉరిమి గజగజలాడించింది. పంటలకు నష్టం కలిగించింది. భారీ వృక్షాలను సైతం నేలకూల్చింది. గుంటూరు జిల్లాలో పలు చోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. కొన్ని ప్రాంతాలను ముంచెత్తింది. దీనికితోడు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు దడ పుట్టించాయి.

- ఈదురుగాలులతో కూడిన వర్షానికి వణికిపోయిన జిల్లా ప్రజలు
- జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లో వర్ష బీభత్సం
- ప్రత్తిపాడు మండలంలో 105.4 మి.మీ. వర్షపాతం నమోదు
- పలు కాలనీలు జలమయం
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- 76 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం



గుంటూరు కంకరగుంట అండర్ బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వర్షపునీరు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. 18 మండలాల పరిధిలో 48 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో రికార్డు స్థాయిలో 105.4 మి.మీ.పడింది. గుంటూరు పశ్చిమలో 103.4, వట్టిచెరుకూరు 99, పెదనందిపాడు 88.6, తుళ్ళూరు 86.4, గుంటూరు తూర్పు 84.2, కాకుమాను 53.2, తాడికొండ 50.2, పెదకాకాని 37.4, మంగళగిరి 27.8, చేబ్రోలు 23.8, దుగ్గిరాల 17.8, మేడికొండూరు 15.6, పొన్నూరు 14.8, ఫిరంగిపురం 11.2, తెనాలి 10.2, కొల్లిపర మండలంలో 8.4 మి.మీ. చొప్పున వర్షపాతం కురిసింది.

### దెబ్బతిన్న ఉద్యాన పంటలు

జిల్లాలో 76 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో చేబ్రోలు మండలంలోని నారాకోడూరు, వేజండ్ల, గుండవరం గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని తుమ్మలపాలెం గ్రామాల్లో 66 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. ప్రత్తిపాడు మండలంలోని తుమ్మలపాలెం గ్రామంలో 10 ఎకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. మొత్తం 89 మంది రైతులు ఈ వాన దెబ్బకు రూ.7.60 లక్షలు నష్టపోయినట్లు అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు.

### జనజీవనం అస్తవ్యస్తం..

ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన వర్షానికి గుంటూరు నగరంతోపాటు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. పాతగుంటూరులో మెయిన్ రోడ్‌లో చెట్లు కూలి రవాణా వ్యవస్థకు అడ్డంకిగా మారాయి. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. డొంకరోడ్‌లోని మూడు వంతెనలు, పీకల వాగుతోపాటు పలు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కొన్నిచోట్ల ఆయిల్ ఇంజిన్లు పెట్టి నీటిని బయటకు తరలిస్తున్నారు.

- పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామంలో పశువుల పాకపై పిడుగు పడి పాక అంతా కాలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.
- చేబ్రోలు మండలం, గొడవర్రు గ్రామంలోని నడింబజారు వద్ద మక్కే వీర రాఘవయ్య ఇంటి ముందు గల కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న పూరి పాక పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో టీవీ, ఫ్యాను, ఫ్రిజ్, ఇతర ఇంటి సామగ్రి పాడైపోయాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.



మూడు వంతెనల బ్రిడ్జి వద్ద కాలువలో చెత్త తొలగింపు

## జలమయమైన గుంటూరు నగరం

- ప్రధాన రహదారులను ముంచెత్తిన మురుగునీరు.. అంతా బురదమయం
- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలకు తప్పని అవస్థలు

పట్నంబజారు: అర్ధరాత్రి బీభత్సమైన గాలివానతో నగర ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. గుంటూరు నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయం అయ్యాయి. భీకరమైన ఈదురు గాలులు వీయడంతో చెట్లు నేలకొరిగాయి. గురువారం అర్ధరాత్రి దాటాక సుమారు రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రజలను ఆందోళనకు గురిచేసింది. గుంటూరు తూర్పు నియోజకవర్గం పాతగుంటూరు ప్రధాన రహదారిలో బేకరి వద్ద చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు మూడున్నర గంటలపాటు సిబ్బంది కష్టపడి లైన్లకు మరమ్మతులు చేశారు. అనంతరం సరఫరాను పునరుద్ధరించారు. చాలాప్రాంతాల్లో విద్యుత్ లేక చీకటి అలుముకుంది. బూరెలవారి వీధిలో చెట్టు నేలకొరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మార్కెట్ ప్రాంతం జలమయం, బురదమయం కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చేపల మార్కెట్ బజారు తటాకాన్ని తలపించింది. అటువైపు వ్యాపారులు, వినియోగదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మూడు వంతెనల వద్ద భారీగా వర్షపు నీరు చేరడంతో అటు వైపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కంకరగుంట పైవంతెన ప్రాంతంలో భారీగా నీరు నిలిచిపోవడంతో అటుగా ప్రయాణం సాగని దుస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు కనీసం మోటార్ల ద్వారా కూడా నీరు తొలగించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. బ్రాడీపేట, ఏటీ అగ్రహారం తదితర ప్రాంతాలో చెట్లు నేలకొరిగాయి. గాలివాన బీభత్సంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

## విలువలతో కూడిన వైద్య సేవలు అందించాలి

- ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్
- ఘనంగా గుంటూరు మెడికల్ కాలేజీ డే వేడుకలు



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సుందరాచారి, డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ

గుంటూరు మెడికల్: వైద్యులు విలువలతో కూడిన సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మెడికల్ కాలేజీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యులు చికిత్స అందించే సమయాల్లో రోగులకు ఎలాంటి హాని జరగకుండా చూడాలన్నారు. గుంటూరు వైద్య కళాశాలలో చదివిన ఎంతో మంది దేశ, విదేశాల్లో పేరుప్రఖ్యాతులు పొందడం వైద్య కళాశాల గొప్పతనం అన్నారు. జింఖానా చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వచ్చేనెలలో అన్ని వైద్య కళాశాలలను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ సుందరాచారి బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల కాలంలో దాతల సహాయంతో రూ. కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశారు. వాటిని వీడియో రూపంలో వీసీ ముందు ప్రదర్శించడంతో సదరు వీడియోను తనకు పంపించాలని సూచించారు. అన్ని కళాశాలలు డాక్టర్ సుందరాచారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

**రోగి నమ్మితే నీరు కూడా మెడిసినే...**

వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి మాట్లాడుతూ డాక్టర్లపై రోగులకు నమ్మకం ఉండేలా ప్రవర్తన ఉండాలన్నారు. రోగి నమ్మితే నీరు కూడా మందులా వారికి పనిచేస్తుందని, వారు నమ్మకపోతే మందు ఇచ్చినా విషంలా భావిస్తారన్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ వైద్య కళాశాలలో కాలేజ్ డే సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్, కల్చరల్ కార్యక్రమాల ద్వారా పవర్ నాలెడ్జ్ వస్తుందని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ కరిక్యులమ్ చాలా ఎక్కువగా ఉంటుందని, ఎడ్రినా, తరంగ్ పేర్లతో కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీలతో వైద్య విద్యార్థులకు ఆక్సిజన్ ఇచ్చినట్లు అవుతుందన్నారు. మరో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, జింఖానా కో ఆర్డినేటర్ డాక్టర్ బాలభాస్కరరావు, పలువురు బోధనా సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు సుమారు 700 పతకాలు ప్రదానం చేశారు.

## వైద్యారోగ్యశాఖలో లక్ష్యాలను చేరుకోవాలి

- అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్
- జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నూరు శాతం చేరుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి చాంబర్‌లో ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం జరిగింది. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రోగ్రాం ఆఫీసర్లు ప్రతినెలా స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదవుతున్న క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని చెప్పారు. క్షయ, హెచ్ఐవీ కార్యక్రమాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రత్యేకంగా సమీక్షించాలన్నారు. మాతృ, శిశు మరణాలు తగ్గించడంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో వెనుకబడిన కేంద్రాలపై ప్రత్యేకంగా సమీక్షించాలన్నారు. కుష్టు వ్యాధి ద్వారా అంగవైకల్యం పొందిన వ్యాధిగ్రస్తుల డేటాను ప్రోగ్రాం ఆఫీసర్లకు ఇచ్చి పర్యవేక్షించాలన్నారు. ఈ.హెచ్.ఆర్, అభా ఐడీల లక్ష్యాలను సకాలంలో సాధించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలలో ప్రమాదకర పరిస్థితులపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించాలన్నారు. అసంక్రమిత వ్యాధులపై జరుగుతున్న సర్వేను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. అంటువ్యాధుల నిర్మూలనకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మనాయక్, వైద్యాధికారులు జయరామకృష్ణ, వరప్రసాద్, ప్రియాంక, డెమో జయప్రసాద్, డెప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్, డీపీఓ సైమన్ రాజు, ఉమా జ్యోస్పిన్ రాణి, ఎ.ఎస్.ఓ. శ్రీధర్ రెడ్డి, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

# కూటమిలో వేరు కుంపట్లు

- మంత్రి నాదెండ్ల ఒక వైపు.. ఎమ్మెల్సీ ఆలపాటి మరోవైపు
- తెనాలిలో తలలు పట్టుకుంటున్న జనసేన, టీడీపీ కార్యకర్తలు
- బిక్కుబిక్కుమంటున్న అధికారులు





వేర్వేరుగా వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్సీ ఆలపాటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఎన్నికల పొత్తులో భాగంగా జనం వద్దకు కలిసి వచ్చిన నాయకులు, అధికారం రాగానే 'ఎవరి దారి వారిదే' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా పార్టీల కార్యకర్తలు, అధికారులకు ఏం చేయాలో పాలు పోవటం లేదు. జనసేనకు చెందిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీకి చెందిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ల వ్యవహారశైలి ఇందుకు నిదర్శనం. కొంతకాలంగా ఇద్దరి మధ్య పొసగడం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి తెనాలిలో శనివారం ఒకే సమయంలో వేర్వేరు కార్యక్రమాలు జరపడానికి నిశ్చయించుకోవడం బలం చేకూర్చుతోంది.

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఉదయం స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి, మార్కెట్ సెంటర్లో 'మెగా క్లీనింగ్'లో పాల్గొంటారని ప్రకటించారు. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి చెంచుపేటలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. అధికారులతోపాటు వార్డు కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన నాయకులకు ఆహ్వానం పలికారు.
- టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా సాయంత్రం 4 గంటల నుంచి పట్టణంలో త్రివిధ దళాలకు మద్దతుగా 'తిరంగ ర్యాలీ' చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ మతాల నాయకులు, పౌరులతోపాటు కూటమి పార్టీల నాయకులను పాల్గొనాల్సిందిగా కోరుతూ ప్రకటన చేశారు. దీంతో ఒకే సమయంలో వేర్వేరు కార్యక్రమాలను ప్రకటించటంతో ఎవరికీ అంతు చిక్కడం లేదు.
- ఈ నెల 9న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అదే రోజు ఎమ్మెల్సీ ఆలపాటి కూడా టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు.
- ఈ నెల 12న నియోజకవర్గంలోని మండల కేంద్రంలో మంత్రి నాదెండ్ల ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, తెనాలి సబ్‌కలెక్టర్ సహా వివిధ శాఖల అధికారులు కలిసి అక్కడ దాదాపు 200 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక్కడ కూడా ఎమ్మెల్సీ ఆలపాటి కనిపించలేదు.

### కోడి పందేలతో 'కాక'

- సంక్రాంతి పర్వదినానికి కోడి పందేలతో మొదలైన వైరం తర్వాత కాలంలో మరింత వేడెక్కింది. ఆ పందేల వ్యవహారం కారణంగా ఒక పోలీసు అధికారి కూడా సెలవుపై వెళ్లాల్సి వచ్చిందని చెబుతారు.
- రాష్ట్రంలోని 80 పైగా వ్యవసాయ మార్కెట్ యార్డులకు చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. తెనాలి మార్కెట్‌యార్డుకు మాత్రం ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. ఆలపాటి, నాదెండ్ల మధ్య అంగీకారం రాకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.
- ఇదే వైఖరితోనే వైకుంఠపురం దేవస్థానానికి గత ప్రభుత్వం నుంచి ఉన్న ట్రస్ట్‌బోర్డునే కొనసాగిస్తున్నారని పబ్లిక్ టాక్.
- తెనాలి పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనాలకు అయిదో అంతస్తు వ్యవహారం కూడా కొన్ని నెలలుగా పెండింగులో ఉంది. నిబంధనల ప్రకారం అందుకు అవకాశం లేకున్నా, ఎన్నో ఏళ్లుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నాదెండ్ల అధికారంలోకి రాగానే, అయిదో అంతస్తుకు అనుమతులు ఇవ్వొద్దని ఆదేశించారు. తనకు తెలీకుండా ఇస్తే, సస్పెండ్ చేయిస్తానని కూడా హెచ్చరించారు.

### ఇక్కడే ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు

ఎన్నికల తర్వాత కొద్ది సమావేశాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొన్న నాదెండ్ల, ఆలపాటిల మధ్య ఆధిపత్య పోరుకు అంకురార్పణ జరిగింది. ఎమ్మెల్యే స్థానాన్ని త్యాగం చేసిన భావనలో ఉన్న ఆలపాటి ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత దూకుడు ప్రదర్శిస్తూ వచ్చారు. ఆయన అనుచరగణం మరో అడుగు ముందంజలోనే ఉన్నారు. ప్రభుత్వ అధికారులకు నేరుగా ఫోన్లు చేస్తూ తమ పనులు చేసి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్ని పనులు చేయించుకుంటున్నారు. దీనిపై మంత్రి వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా తలనొప్పి వ్యవహారంలా తయారై ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

- ఆయా భవనాల యజమానులు ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఆలపాటిని కలిసి ఎన్నికల విరాళం ఇచ్చి, తమ సంగతి చూడాలంటూ ప్రాధేయపడ్డారని చెబుతారు. ఎన్నికలయ్యాక చూద్దామని ఆలపాటి అప్పట్లో హామీ ఇచ్చినట్టు చెప్పుకున్నారు. తీరా ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ అయిదో అంతస్తు పడనే లేదు.

ఈ నేపథ్యంలో ఎవరికి వారు పోటా పోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే జనానికి చోద్యంగా ఉన్నా, ఆయా పార్టీల కార్యకర్తలు మాత్రం విస్తుపోతున్నారు.

## 'ఆపరేషన్ సిందూర్'కు సంఘీభావం



నినాదాలు చేస్తున్న అధికారులు, చిన్నారులు

లక్ష్మీపురం: పాక్‌పై యుద్ధం చేసిన భారత జవానులకు దేశమంతా అండగా ఉందని, ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి జవాన్‌కు కృతజ్ఞతలు తెలపాలని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్ అన్నారు. గుంటూరు డీఆర్ఎం సుధేష్టా సేన్ నేతృత్వంలో 'ఆపరేషన్ సిందూర్' సంఘీభావ ర్యాలీని గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి రైల్వే స్టేషన్ వరకు శుక్రవారం చేపట్టారు. ప్లాట్‌ఫారాలపై నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ర్యాలీలో అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీర మరణం పొందిన జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఎంఈ ఎం. రవికిరణ్, ఏఎస్‌సీ శైలేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 3,500 గరిష్టం : రూ. 5,000

మోడల్ ధర రూ. 4,200



## పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 305

కొమ్ములు : 246 బస్తాలు

| కనిష్ట : | గరిష్ట : (ధర రూ॥ల్లో) | మోడల్ : |
|---|---|---|
| 10,300 | 11,150 | 10,950 |

కాయలు : 59 బస్తాలు

| కనిష్ట : | గరిష్ట : | మోడల్ : |
|---|---|---|
| 10,300 | 11,100 | 10,950 |

మొత్తం అమ్మకాలు : 228.750 క్వింటాళ్లు

–దుగ్గిరాల

# రాలిన ఆశలు..!

అకాల వర్షంతోపాటు విరుచుకుపడుతున్న ఈదురు గాలులు మామిడి రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంట చేతికొచ్చే సమయానికి టన్నుల కొద్దీ మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతుల బాధ వర్ణణాతీతంగా ఉన్నాయి. దిక్కుతోచని స్థితిలో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



రామయ్య తోటలో నేలరాలిన బంగినపల్లి కాయలు

- ఈదురు గాలులతో మామిడికి దెబ్బ
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

**ప్రత్తిపాడు:** గత మూడు, నాలుగు రోజులుగా పగలు విపరీతమైన ఎండ కాస్తున్నప్పటికీ, మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశం మేఘావృతమై వానలు కురుస్తున్నాయి. దీనికి తోడు భయంకరమైన శబ్దాలతో ఉరుములు, మెరుపులు, భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈ గాలులు మామిడి రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రత్తిపాడు మండలం నడింపాలెం పదహారో జాతీయ రహదారి సమీపంలో కొందరు రైతులు మామిడి తోటలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఏడాదంతా స్వేదం చిందించి వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేశారు. కౌలుతో కలిపి సాగుకు రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. కాపు బాగా రావడం, ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో కాస్త ధైర్యంగా ఉన్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు మూడు రోజులుగా ముప్పేట దాడి చేస్తుండటంతో వారి ఆశలు అడిఆశలయ్యాయి. గాలుల దెబ్బకు కాయలు నేలరాలడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు.



పెద్ద శివయ్య తోటలో రాలిన కాయలు కుప్పగా పోసిన దృశ్యం

### మార్కెట్‌కు వెళితే దక్కని ధర

బహిరంగ మార్కెట్‌లో మామిడి పంట రకాన్ని బట్టి టన్ను రూ. 35 వేల నుంచి రూ. 50 వేల వరకు ధర పలుకుతోంది. ఈదురుగాలులకు కాయలు రాలడంతో పగలడం, గీతలు పడటం, దాగులు పడ్డాయి. దీంతో మార్కెట్‌కు తీసుకువెళ్లిన రైతులకు చేదు అనుభవం మిగులుతుంది. టన్ను రూ. 3 వేలకు అడుగుతుండటంతో కన్నీటి పర్యంతం అవుతున్నారు.

### ఖర్చులూ వచ్చే పరిస్థితి లేదు

పంట బాగుంది... మరో పది, పదిహేను రోజుల్లో చేతికొస్తుందనుకున్నా. ఇంతలోనే ఈదురుగాలులతో కాయలన్నీ నేలరాలాయి. కౌలుతో కలిపి పెట్టుబడి సుమారుగా రూ. పది లక్షలు అయ్యింది. సుమారు 15 టన్నులకు పైగా కాయలు రాలిపోయాయి. టన్ను రూ. 3 వేలకు అడిగారు. ఖర్చులు కూడా వచ్చేలా లేవు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆళ్ల రామయ్య, నడింపాలెం

### కన్నీళ్లే మిగిలాయి

ఈ ఏడాది కౌలుకు తీసుకుని మామిడి సాగు చేశాను. బంగినపల్లి, చిత్తూరు, తెల్లరసాలు, మిమాయత్తులు.. వంటి రకాలు సాగుకు సుమారు రూ. నాలుగు లక్షలు పెట్టుబడి అయ్యింది. మరో వారం, పది రోజుల్లో పంట చేతికొస్తుందనుకుంటే ఇలా నేలరాలిపోయాయి. ఇప్పుడు కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. ప్రభుత్వం వెంటనే మామిడి రైతులను ఆదుకోవాలి.

– ఎం. పెద్ద శివయ్య, నడింపాలెం

## డెంగీపై అవగాహన ర్యాలీ

**గుంటూరు మెడికల్:** జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గుంటూరు లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని పచ్చ జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో వైద్య సిబ్బంది, ప్లకార్డులు చేతబూని దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. పట్టణ ఆరోగ్యకేంద్రం నుంచి యాదవ హైస్కూల్ వరకు ర్యాలీ కొనసాగి తిరిగి ఆరోగ్య కేంద్రం చేరింది. ర్యాలీలో కార్పొరేటర్ మీరావలి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, వైద్యాధికారులు ఫిర్దోస్ అహ్మద్, అజీమా ఖాతున్, సబ్ యూనిట్ ఆఫీసర్లు ఘంటసాల శ్రీనివాసరావు, నరేంద్రబాబు, డెప్యూటీ మీడియా అధికారి ప్రశాంత్, వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి శివగనేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, వైద్య అధికారులు

## అస్థిపంజరం గుర్తింపు

వివరాలు వెల్లడించిన తాడేపల్లి పోలీసులు

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం ఇప్పటం బకింగ్‌హామ్ కెనాల్ కట్ట వెంబడి ఉన్న డొంకరోడ్డు నుంచి పోలీసులు అస్థిపంజరం తరలించగా, మృతుడి వివరాలను తాడేపల్లి పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాజావలి మాట్లాడుతూ.. ఆదివారం అస్థిపంజరం ఉందని సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడకు క్లూస్‌టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించామని తెలిపారు. అస్థిపంజరం కావడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలోని ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. పురుషుడి అస్థిపంజరంగా తెలిపారని పేర్కొన్నారు. ఈ వివరాలను మిగిలిన పోలీస్‌స్టేషన్‌లకు పంపించామని, అక్కడ మిస్సింగ్ కేసులు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు. డీఎన్ఏ పరీక్ష ద్వారా ఆ మృతదేహం ఎవరిదో గుర్తిస్తామని తెలిపారు. ఇది హత్యా? ఆత్మహత్యా? అనే వివరాలు ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు. మిగిలిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

## పిడుగు పడి గేదె మృతి

**కర్లపాలెం:** మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు పిడుగు పడి ఓ గేదె మృతిచెందిన సంఘటన పెదగొల్లపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం రాత్రి ఈదురుగాలులు మెరుపులతో కురిసిన వర్షాలకు పిడుగుపడి పెదగొల్లపాలెం గ్రామానికి చెందిన బత్తుల అమరయ్యకు చెందిన రూ.లక్ష విలువ గలిగిన గేదె మృతిచెందినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### వేసవి ప్రత్యేక రైళ్లు

**లక్ష్మీపురం:** దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సమ్మర్ స్పెషల్ రైళ్లు ప్రయాణికుల సౌకర్యార్థం కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ గురువారం తెలిపారు. నంబరు 07441 చర్లపల్లి -విశాఖపట్నం రైలు ఈ నెల 17న చర్లపల్లి స్టేషన్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరనుందన్నారు. మరుసటిరోజు మధ్యాహ్నం 3.35 గంటలకు విశాఖపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. నంబరు 07442 విశాఖపట్నం – చర్లపల్లి రైలు ఈ నెల 18న విశాఖపట్నం నుంచి రాత్రి 11 గంటలకు బయల్దేరి చర్లపల్లి స్టేషన్‌కు మరుసటిరోజు ఉదయం 11.40 గంటలకు చేరుకుంటుందన్నారు.

### ప్రైవేటు బడుల్లో ఉచిత ప్రవేశాలకు గడువు పెంపు

**నరసరావుపేట ఈస్ట్:** విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వి.సుబ్బారావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 15వ తేదీ నుంచి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు.

# దేశాభివృద్ధికి సాంకేతికత అవసరం

**గుంటూరు వెస్ట్:** దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే మానవ వనరులతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గత రెండు రోజుల నుంచి స్థానిక రింగురోడ్డులోని ఐటీసీ-వెల్కమ్ హోటల్లో భూ సర్వే, రికార్డుల డిజిటలైజేషన్‌పై జరుగుతున్న కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పెమ్మసానితోపాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రికార్డులను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్నతాధికారులతోపాటు అనేక మంది మేధావులు ఈ వర్క్‌షాప్‌లో తమ అనుభవాలను పంచుకున్నారన్నారు. భవిష్యత్తులో ప్రజలకు భూ పరమైన సమస్యలు తలెత్తకుండా ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేయడం, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పాటిల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. పట్టణాల్లో పారదర్శకమైన, సమర్థ పాలన తీసుకొచ్చేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. నక్షా పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా దేశంలో 152 మున్సిపాలిటీలను ఎంపిక చేశారని తెలిపారు. మన రాష్ట్రంలో కుప్పం, ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, మంగళగిరి, తాడేపల్లి, ఏలూరు, తిరుపతి నగరపాలక సంస్థలున్నాయని తెలిపారు. ఈ పది మున్సిపాలిటీల్లో ఉన్న 524 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న 9.5 లక్షల ఆస్తులను సర్వే చేసి డిజిటలైజేషన్ చేయనున్నామని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జి.జయలక్ష్మి, డీఓఎల్ఆర్ కార్యదర్శి మనోజ్ జోషి, డీఓఎల్ఆర్ డైరెక్టర్ డి.ఎన్. జోషి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

## నీట్‌లో బాపట్ల విద్యార్థినికి 47వ ర్యాంక్

**బాపట్ల టౌన్:** గత నెలలో జరిగిన నీట్ పీజీ ఎండీఎస్ ప్రవేశ పరీక్షలో బాపట్ల పట్టణానికి చెందిన పీటా జ్యోతిర్మయి ఆల్ ఇండియా స్థాయిలో 47వ ర్యాంక్ సాధించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన జ్యోతిర్మయి ఇంటర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్ సాధించారు. సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో బీడీఎస్ పూర్తిచేసిన జ్యోతిర్మయి ప్రస్తుతం ఆల్ ఇండియా 47వ ర్యాంకు సాధించడం పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.



పీటా జ్యోతిర్మయి

### జాబ్‌మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**నరసరావుపేట:** ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న చిలకలూరిపేటరోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. నియోజకవర్గం, పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహీంద్ర, టెక్నో టాస్క్, బిజినెస్ సొల్యూషన్స్, మాస్టర్ మైండ్, గోదావరి ఆంధ్ర కార్పొరేటివ్ బ్యాంక్, అపెక్స్ సొల్యూషన్స్, వి చేంజ్ సొల్యూషన్స్, అక్రో సాఫ్ట్ సొల్యూషన్స్, హెటిరో డ్రగ్స్ వంటి సుమారు 21 కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10వేలు నుంచి రూ.40వేలు వరకు ఉండవచ్చని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, రామాంజనేయులు, వీరాంజనేయులు, కృష్ణవేణి డిగ్రీ కళాశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల ఎస్ఐ అఫ్రీన్ నసీహా తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం తంగేడ గ్రామానికి చెందిన తోకల రవి (45), అతని తల్లి నాగమ్మ, డ్రైవర్ పోల్ సాగర్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి పరిధిలోని దూస్ పంజాబీ దాబా వద్దకు రాగానే దాబా నుంచి లారీ అకస్మాత్తుగా జాతీయ రహదారిపైకి వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రవికి తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని వెంటనే నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

# అదుపు తప్పి కారు బోల్తా



కారును కరకట్టపైకి లాగిస్తున్న పోలీసులు



ప్రమాదానికి గురైన కారు

ఉండవల్లి అమరావతి కరకట్టపై ప్రమాదం

**తాడేపల్లి రూరల్:** ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ముఖ్యమంత్రి నివాసానికి కొద్ది దూరంలో శుక్రవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి ఉండవల్లి అమరావతి కరకట్ట మీదుగా సచివాలయానికి వెళుతుండగా కారు అదుపు తప్పి కిందకు జారిందని పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున కురిసిన అకాల వర్షం కారణంగా కరకట్ట వెంబడి మార్జిన్‌లో ఉన్న మట్టి కరిగి ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. అదుపుతప్పిన కారును క్రేన్ సహాయంతో బయటకు తీసి కేసు నమోదు చేశామని వివరించారు. కారును పైకి తీసే సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించినట్లు పోలీసులు తెలిపారు.

## పశువుల పాకపై పిడుగుపాటు

**ప్రత్తిపాడు:** పశువుల పాకపై పిడుగు పడిన ఘటన పెదనందిపాడు మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతోపాటు ఈదురుగాలులు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. పెద్ద శబ్దాలతో ఉరుములు ఉరుముతూ పిడుగులు పడ్డాయి. మండల పరిధిలోని గోగులమూడికి చెందిన సీహెచ్ నరసింహారావుకు చెందిన పశువుల పాకపై పిడుగు పడింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పాకలో పశువులు లేకపోవడంతో నష్టం జరగలేదు. కాలిపోయిన పాకను మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీంపీరాతో పాటు స్థానిక నాయకులు పరిశీలించారు. బాధితుడిని అడిగి వివరాలను తెలుసుకున్నారు.



మంటల్లో కాలిపోతున్న పశువుల పాక

## ఆటో బోల్తా పడి వృద్ధురాలు మృతి

**లక్ష్మీపురం:** ఆటో బోల్తా పడి అందులో వెళ్తున్న వృద్ధురాలు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇమ్మడి సామ్రాజ్యం (64) భర్త, బంధువులతో కలిసి శుక్రవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన ఆటోలో జొన్నలగడ్డ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్‌కు బయలు దేరారు. అరండల్‌పేట 11వ లైన్ వద్దకు చేరుకునే సరికి వర్షం, విపరీతమైన గాలుల వల్ల ఆటో బోల్తా పడింది. సామ్రాజ్యం తలకు తీవ్ర గాయం అయింది. దీంతో భర్త కృష్ణార్జునరావు, స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు వెల్లడించారు. అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

## చేపల చెరువులో మునిగి జాలరి మృతి

**నూజెండ్ల:** చెరువులో చేపలు పడుతూ ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వి.అప్పాపురం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం చింతాయగారిపాలెం గ్రామానికి చెందిన చాపల ఏడుకొండలు (55) చేపలు పట్టే కూలీగా జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో వి.అప్పాపురం గ్రామంలో పరిసరాలలో తోటి వారితో కలసి రోజులాగే చెరువులో దిగి వల వేసి చేపలు లాగుతుండగా హఠాత్తుగా నీటిలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న వారు అతనిని ఒడ్డుకు చేర్చి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఏడుకొండలు మృతి చెందినట్లు తోటి జాలర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఐనవోలు ఎస్సై తెలిపారు.



ఏడుకొండలు (ఫైల్)

# ఏడుగురికి యావజ్జీవ కారాగార శిక్ష

**చీరాల రూరల్:** ఓ వ్యక్తిని అతి కిరాతకంగా హత్యచేసిన కేసులో ఏడుగురు నేరస్తులకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2,000 జరిమానా విధిస్తూ ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన మృతుడు మోసా సూరిబాబు (30) వద్ద రెండేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రి రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించమని సూరిబాబు అనేకసార్లు సింహాద్రిని అడిగినా అప్పు తీర్చలేకపోయాడు. అంతేకాక సూరిబాబుకు సింహాద్రి భార్యతో అక్రమ సంబంధం ఉన్నదని గ్రామంలో కొంతమంది చర్చించుకుంటున్న విషయం సింహాద్రి దృష్టికి వచ్చింది. ఈ విషయమై సింహాద్రి తనభార్యతో పాటు సూరిబాబుపై అనుమానం పెంచుకున్నాడు. అనుమానం పెనుభూతంగా మారడంతో సూరిబాబును ఎలాగైనా చంపాలని సింహాద్రి నిర్ణయించుకున్నాడు. ఈ విషయంలో సహకరించాల్సిందిగా సింహాద్రి తన కొడుకు, కూతురుతోపాటు గ్రామంలో మరో ఆరుగురు పిక్కి శాంతి, బొంది డేవిడ్, పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యరావుల సాయం కోరాడు. అందుకు అందరూ అంగీకరించడంతో సూరిబాబును చంపేయాలని పథకాన్ని అమలు చేసేందుకు వ్యూహ రచన చేశాడు.

### కూతురు వివాహం పేరుతో..

అయితే సింహాద్రి తన కుమార్తెను మృతుడైన సూరిబాబుకు ఇచ్చి వివాహం చేస్తానని నమ్మించాడు. తన ఇంటికి భోజనానికి రావాలని సూరిబాబును ఐదు రోజుల నుంచి సింహాద్రి ఆహ్వానిస్తున్నాడు. 10 అక్టోబర్ 2023న రాత్రి 8 గంటల సమయంలో సూరిబాబు, సింహాద్రికి ఫోన్‌చేసి భోజనానికి ఆహ్వానించడంతో సూరిబాబు అంగీకరించాడు. సూరిబాబు భోజనానికి వస్తున్న విషయంపై నిందితులకు ముందుగానే సమాచారం అందించాడు. సింహాద్రి వారందరికి కర్రలు, ఇనుపరాడ్లు, పైపులు అందించి తన ఇంటిలో దాచాడు. సింహాద్రి మాటలు నమ్మిన సూరిబాబు రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన సింహాద్రితోపాటు అందరూ కలిసి సూరిబాబుపై ఇష్టమొచ్చినట్లు దాడి చేశారు. మృతుడు సూరిబాబు అక్క ఎల్లియమ్మ తన తమ్ముడు ఇంటివద్ద లేకపోవడంతో అనుమానం వచ్చి తన బంధువులను తీసుకుని సింహాద్రి ఇంటికి వెళ్లింది. సూరిబాబు ఇక్కడకు రాలేదని సింహాద్రి కూతురు మరికొందరు కలసి ఎల్లియమ్మ ఆమె బంధువులను అడ్డగించి వాదనకు దిగారు. ఇంటిలోపల ఏదో జరుగుతుందని అనుమానం వచ్చి ఎల్లియమ్మ ఆమె బంధువులు కలసి బలవంతంగా ఇంటిలోపలకు ప్రవేశించారు. దీంతో సూరిబాబు తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడి ఉండటం గమనించి చికిత్స నిమిత్తం ఆటోలో చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సూరిబాబును పరిశీలించిన డ్యూటీలో ఉన్న వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు సూరిబాబు అక్క ఎల్లియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పైన పేర్కొన్న నేరస్తులందరిపై ఈపురుపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

**జీవిత ఖైదు.. జరిమానా..**

బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఎ.మల్లికార్జునరావు నిందితులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ కేసును పూర్తిస్థాయిలో విచారించారు. నిందితులపై ఉన్న నేరారోపణలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డి పోలీసుల సాయంతో సరైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి తన వాదలతో నిరూపించారు. న్యాయమూర్తి ఏడుగురు నిందితులకు జీవిత ఖైదు విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నేరస్తులకు శిక్షలుపడే విధంగా కృషిచేసిన అప్పటి సీఐ ఎ. మల్లికార్జునరావు, ప్రస్తుత సీఐ పి.శేషగిరిరావు, జిల్లా కోర్టు కానిస్టేబుల్ షేక్ కరిముల్లా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డిని ఎస్పీ అభినందించారు.

హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.





అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్

# మనల్ని మనం తెలుసుకోవడమే..

''అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

> అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

### విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

### ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

### ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను'' అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

● సంకల్ప బలం

# వెయిట్ లిఫ్టర్ బామ్మ @ 70

## వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.



● అజయ్, రోషిణి

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలిసారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహి బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.




# స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...

**అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది..**

**మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...**



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

''లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరఫు, అమ్మ తరఫు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రెయిన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

### అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.

### బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకు వెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!'' అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సూడాన్.

– సరస్వతి రమ

ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

# అప్పడాలతో అదిరే విందు

వంటిల్లు

## సగ్గుబియ్యం అప్పడాలు



**కావలసినవి:** సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మరసం – అర టీస్పూన్.

**తయారీ:** ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

## మిరియాల అప్పడాలు



**కావలసినవి:** బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

## టమాటో అప్పడాలు



**కావలసినవి:** టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

**తయారీ:** టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

# కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్–బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్–ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.